క్లుప్తంగా

ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం

జగిత్యాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లాలో 51 ప్రైమరీ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు డీఈవో రాము తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అడ్మిషన్లు సైతం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటాం



చిరు వ్యాపారులకు సూచనలిస్తున్న ఎస్సై

మెట్‌పల్లి: రోడ్డుపై విక్రయాలు జరుపుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జాతీయ రహదారికి ఇరువైపులా బుధవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుపైనే చిరు వ్యాపారులు నిర్వహిస్తున్న వారితో పాటు ఆటో, జీపు డ్రైవర్లను మందలించారు. రోడ్డుపైనే విక్రయాలు జరపడం, వాహనాలను పెట్టడం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నడుచుకోవాలని వారికి సూచించారు. అలాగే రోడ్డుపైనే చెత్తను వేసిన ఓ రెస్టారెంట్ నిర్వాహకుడికి రూ.2 వేల జరిమానా విధించారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్ల పరిశీలన



ఇల్లును పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను మున్సిపల్ కమిషనర్ రవీందర్ బుధవారం పరిశీలించారు. హాజీపురాలో శిథిలావస్థ ఇంట్లో ఉంటున్న ముబీన్ కుటుంబాన్ని గుర్తించి సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని కమిషనర్ సూచించారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్లు ఎంఏ రఫీ, రేష్మఫర్దీన్,తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత

జగిత్యాలక్రైం: సెల్‌ఫోన్లు వాడే వారు తమ ఫోన్లు జాగ్రత్తగా చూసుకోవాలని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. బుధవారం కోరుట్ల పట్టణానికి చెందిన బాస రఘు, జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన గట్కు లక్ష్మణ్ తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి వారికి అప్పగించారు.

తెలుగు తేజం పురస్కారానికి కనికారపు స్వామి ఎంపిక



కనికారపు స్వామి

రాయికల్: మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన కవి కనికారపు స్వామి తెలుగు తేజం తెలుగు భాష సేవ పురస్కారానికి ఎంపికైనట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ ప్రతాప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష దినోత్సవ సంబరాల్లో భాగంగా కనికారపు స్వామి రచనలకు గాను ఆగస్టు 31న ఆంధ్రప్రదేశ్‌లోని నర్సరావుపేటలోని కొత్త రఘురామయ్య ఆడిటోరియంలో నిర్వహించే తెలుగు భాష దినోత్సవంలో తెలుగు భాష సేవా పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

'గణేశ్' వివరాలు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా వారి వివరాలు పోలీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. బుధవారం రాయికల్ పద్మశాలీ సంఘం భవనంలో వినాయక నవరాత్రి ఉత్సవాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తప్పసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, విద్యుత్ శాఖ అనుమతి పొందాలని, సీసీకెమెరాలు అమర్చుకోవాలని, కార్యక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సుధీర్‌రావు పాల్గొన్నారు.

ఇసుక మేటలు.. నష్టపోతున్న రైతులు

- ప్రతీ వర్షాకాలంలో ఇదే పరిస్థితి
- సాగుకు అనుకూలంగా మార్చడానికి శ్రమిస్తున్న రైతులు



రేచపల్లిలోని ఓ రైతు పొలంలో ఇసుక మేటలు

సారంగాపూర్: భారీ వర్షాలతో వచ్చిన వరదలతో వ్యవసాయ భూముల్లో ఇసుకమేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇసుక మేటలు వేసిన భూమిలో తిరిగి పంటలు వేయలేక, సేద్యానికి అనుకూలంగా మార్చుకోవాలంటే రైతుకు ఆర్థిక భారమవుతోంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో రైతుల వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు వేశాయి.

ఇసుక మేటలు:

ప్రతీ వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో వాగులు, వంకలు ఉప్పొంగి పంట పొలాల్లోకి ఈ నీరు ప్రవేశించి ఇసుకమేటలు పెడుతున్నాయి. గ్రామాలను ఆనుకుని ఉన్న అడువుల్లోని గుట్టలపై నుంచి వచ్చే వరద నీరు వాగుల ద్వారా గోదావరిలోకి వెళ్లాలి, లేదా కొన్ని గ్రామాల్లో ఎస్సారెస్పీ కాలువల్లోకి చేరుతుంది. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దిగువన ఉన్న రైతులు తమ పొలాలను ఆనుకుని ఉన్న ఒర్రెల భూములను కలుపుకుని పంటలు సాగుచేయడం ద్వారా, ఒర్రెల గుండా వెళ్లాల్సిన వర్షపు నీరు ఎగువన ఉన్న రైతుల పొలాల్లోకి ప్రవేశించి ఊహించని విధంగా భారీ వర్షాలు కురిస్తే వచ్చిన వరదలతో పొలాల్లోకి వరద నీరు ప్రవేశించి ఇసుక మేటలు పెద్దఎత్తున ఏర్పడుతున్నాయి.

అటవీశాఖ అడవుల్లోకి కలప స్మగ్లర్లు వెళ్లకుండా, భూగర్భ జలాల పెంపుకోసం అడవుల హద్దుల్లో గతంలో ఏర్పాటు చేసిన కాంటూర్ కందకాలు ప్రస్తుతం పూర్తిగా మట్టితో నిండిపోయాయి. వర్షాలకు కాంటూర్ కందకాల్లో నిలువాల్సిన వరద నీరు దిగువన పంట పొలాల్లోకి చేరి ఇసుక మేటలు పెడుతున్నాయి. చాలా చోట్ల ఏళ్ల కింద తవ్విన కాంటూర్ కందకాలు తెగిపోయి వరదలు పొలాల్లోకి వస్తున్నాయి.

ఇసుక మేటలతో అపారనష్టం

భూముల్లో ఇసుక మేటలు పెట్టినప్పుడు జరిగిన నష్టం వాటిల్లుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇసుక మేటలు వేసిన భూమిలో ఏ పంట వేసినా ఏడారిలో సాగుచేసినట్లేనని రైతులు చెబుతున్నారు. ఒక్క ఎకరంలో ఇసుక మేటలు పెడితే ఆ భూమిని సాగు చేయడానికి రైతులకు తలకుమించి భారమవుతోంది. ఇసుకను తొలగించిన భూమిలో నల్ల మట్టి, ఎర్ర మట్టి లేదా ఇతర సారవంతమైన మట్టిని ట్రాక్టర్ల సహాయంతో తిరిగి పోయాలి. ఈ



పొలంలో ఇసుక మేటలు తొలగిస్తున్న రైతు

కారణంగా ఒక ఎకరం ఇసుకమేటలు వేసిన భూమిని సాగు చేయడానికి రూ. 2 లక్షల వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.. ఇసుక మేటలతో రైతులు చాలా నష్టపోతున్నా.. అధికారులు జరిగిన నష్టాన్ని సర్వే చేసి,ప్రభుత్వానికి నివేదిక పంపినా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

నాటువేసిన వరి పొలం 30 గుంటల విస్తీర్ణంలో ఇసుక మేటలు వేశాయి. దీనిని తిరిగి సేద్యం చేయడానికి వ్యయంతో కూడిన పని, ప్రభుత్వం, అధికారులు స్పందించి కొంత ఆర్థికసాయం, పరిహారం అందిస్తే తిరిగి పొలాన్ని సేద్యానికి అనుకూలంగా మార్చుకుంటాను.

– లక్ష్మారెడ్డి, రేచపల్లి

కొలుకు తీసుకుని పంట వేశాను



నేడు వరి వేసిన పొలం కొలుకు తీసుకుని వరి పంట వేశాను. మొన్నటి భారీ వర్షాలకు పెద్ద ఎత్తున ఇసుక మేటలు వేయడంతో నాటువేసిన పొలం పోయి నష్టం జరిగింది, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– పుష్పనాథ్, సారంగాపూర్.

రేచపల్లి, సారంగాపూర్‌లో ఎక్కువ నష్టం



పొలాల్లో ఇసుక మేటలతో ఏమేరకు నష్టం వాటిల్లిందో నిర్ధారణకు రాలేదు. రేచపల్లి, సారంగాపూర్ గ్రామాల్లో ఇసుక మేటలు ఎక్కువ వేవాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఇసుక మేటలు వేసిన భూములపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

– వెంకటేశ్, ఏఈవో, సారంగాపూర్

డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ సేవలు

జగిత్యాలరూరల్: డ్రోన్ టెక్నాలజీ ద్వారా రైతులకు వ్యవసాయ సేవలు అందుతున్నాయని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నమో డ్రోన్ దీదీ కేంద్ర పథకం కింద మహిళ సంఘాలకు రుణ సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. మహిళ స్వయం సహాయక సంఘాల ఆర్థిక శక్తివంత, ఉపాధి అవకాశాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టే ఉద్దేశంతో ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ కేంద్ర పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా మహిళ స్వయం సహాయక సంఘాలు డ్రోన్ సర్వీస్ ప్రొవైడర్లుగా ఎదగడానికి రుణ సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కల్పన, డ్రోన్ టెక్నాలజీ ద్వారా రైతులకు వ్యవసాయ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అర్హత కలిగిన మహిళ స్వయం సహాయక సంఘాలు తమ సమీప బ్యాంక్ బ్రాంచ్‌లో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తీరం వెంట నీట మునిగిన పొలాలు



గోదావరి వెంట మునిగిన పొలాలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామ శివారుల్లోని గోదావరి నది వరద ఉధృతి బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు బాగా పెరిగి గోదావరి తీరం వెంబడి సాగుచేసిన వరి పొలాల మీదుగా నీరు పారింది. దీనితో రైతులు తమ పొలాల్లో ఇసుకమేటలు, మట్టి దిబ్బలు ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కమ్మునూర్‌లో దాదాపు 20 ఎకరాల్లో వరి మునిగి నీరు పారుతుందని రైతులు పేర్కొన్నారు. కాగ సాయంత్రం వరకు గోదావరి ప్రవాహం కొంత వరకు తగ్గింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులలు సూచించారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి ప్రవాహం

ఇబ్రహీంపట్నం: ఎస్సారెస్పీ నుంచి గోదావరి లోకి 16 గేట్ల ద్వారా 52,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో వరద ప్రవాహం బుధవారం తగ్గింది. మంగళవారం గోదావరి ఉధృతంగా పారడంతో ఆయా గ్రామాల్లో అధికారులు ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరద ప్రవాహం తగ్గడంతో ప్రజల్లో ఉత్కంఠ వీడినట్లయింది.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌కు చెందిన హసిన, సమీన, అఫ్రీన్‌లు వరదల్లో గల్లంతవడం దురదృష్టకరమని, ఈ ఘటన బాధకరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం నుంచి ముఖ్యమంత్రితో మాట్లాడి ఆర్థిక సహాయం అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవి, తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్థికసాయానికి ప్రతిపాదనలు

జగిత్యాలరూరల్: మహారాష్ట్ర వరదల్లో ఆదివారం కొట్టుకుపోయిన టీఆర్‌నగర్‌కు చెందిన అఫ్రిన్, సమీన, హసీన ముగ్గురు మహిళల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేలా కృషి చేస్తామని అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం టీఆర్‌నగర్‌లో గల్లంతైన ఒక్కో కుటుంబానికి రూ.3 వేల నగదుతో పాటు, నిత్యావసర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందేలా నివేదిక ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ వరుణ్‌కుమార్, ఆర్‌ఐ భూమయ్య, శ్రీను, రాజేందర్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



మెట్‌పల్లి లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



ధర్మపురిలో మంత్రి కి నాయకుల నివాళి

కోరుట్ల/ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/కథలాపూర్/మల్యాల/సారంగాపూర్/పెగడపల్లి/మేడిపల్లి/వెల్గటూర్: రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశప్రజల సంక్షేమం కోసం చేసిన సేవలను కొనియాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రత, రక్షణకు షీటీం భరోసా



మాట్లాడుతున్న ఎస్సై రవీందర్

ధర్మపురి: మహిళల భద్రత, రక్షణకు షీటీమ్స్ భరోసా కల్పిస్తుందని ఎస్సై రవీందర్ తెలిపారు. మండలంలోని మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం షీ టీమ్స్, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పాఠశాలల్లో చదివే విద్యార్థులు, విద్యార్థినీలకు ఎలాంటి సమస్యలు ఎదురైన పోలీసులను సంప్రదించవచ్చని సూచించారు. ఏదైన సమస్యలుంటే 8712670783 నెంబర్ ద్వారా వాట్సాప్‌లో కూడ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు షీటీమ్స్, పోలీస్ కళాబృందం పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

మేడిపల్లి: గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మండలంలోని ఎస్సై శ్రీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొండాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించి యువత చెడు దారులకు అలవాటు పడవద్దని, వ్యసనం వైపు చాలా దారులు ఉన్న మనసుని అదుపులో ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అభిలాష్, సురేందర్, కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. బుధవారం మండలంలోని పెంబట్లలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరా ఆవాస్ యోజన పథకం సర్వేపై సమీక్ష నిర్వహించారు. మండలంలో ఒక్క రోజు 42 ఇందిరమ్మ ఇళ్లకు వివిధ గ్రామాల్లో భూమిపూజ చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీట్ పీజీలో జాతీయ ర్యాంకు

కోరుట్ల: పట్టణానికి చెందిన డాక్టర్ కృత్తిక నీట్ పీజీలో జాతీయ స్థాయిలో 17,900 ర్యాంకు సాధించింది. నీట్ పీజీ ఎంట్రన్స్‌కు జాతీయ స్థాయిలో సుమారు 2.45 లక్షల మంది హాజరుకాగా గుండేటి కృత్తిక మంచి ర్యాంకు సాధించడం హర్షనీయమని స్థానిక ఐఎంఎ ప్రతినిధులు, పట్టణానికి చెందిన పలువురు ఆమెను ప్రశంసించారు.

బోధన అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి

వెల్గటూర్: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు గాను బోధన, అభ్యసన పరికరాల తయారీ మేళా ఎంతో ఉపయోగంగా ఉంటుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన మేళాకు ముఖ్య అతిథిగా హాజరై బోధనా, అభ్యసనా పరికరాలను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీష్, పరిసరాల విజ్ఞానానికి సంబంధించి బోధన మెలకువలను పాటిస్తూ, విద్యార్థులతో మమేకం అవుతూ బోధించేందుకు ఉపకరణాలు అత్యంత అనుకూలంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ రాజేష్, ఎంఈవో ప్రభాకర్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వం తీసుకోవాలి

సారంగాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తిదారుల సంఘంలో రైతులు సభ్యత్వం తీసుకోవాలని సారంగాపూర్ సింగిల్‌విండో సీఈవో లైశెట్టి శివ అన్నారు. ఈ సందర్భంగా విండో పరిధిలోని పలు గ్రామాల్లో సిబ్బందితో కలిసి రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘంపై అవగాహన కల్పించారు. ఈ సంఘంలో చేరడానికి రైతులు రూ. 2 వేలు చెల్లించాలని, వివిధ వ్యాపారాల నిర్వహణ వలన సంఘానికి వచ్చే లాభాన్ని ఏటా సభ్యులకు వాట ధనం రూపంలో చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సిబ్బంది భూమేశ్, గంగారెడ్డి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తనిఖీ

కథలాపూర్: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. భూ భారతి కార్యక్రమంలో గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని అని అడిగి తెలుసుకున్నారు. సూరమ్మ ప్రాజెక్టు కాలువ పనుల భూసేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వినోద్ ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో డీపీవో..

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయాన్ని డీపీవో మదన్‌మోహన్ బుధవారం తనిఖీ చేశారు. అడ్వాన్స్ ఇండెక్స్, గ్రామపంచాయతీ ఎన్నికలకి సంబంధించిన పోలింగ్ స్టేషన్‌ల వారీగా రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో ఎం.డీ సలీం ఉన్నారు.

జెడ్పీ హైస్కూల్‌ను ఎంపీడీవో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి జెడ్పీ హైస్కూల్‌ను ఎంపీడీవో ఎం.డీ సలీం బుధవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనం అందించాలన్నారు. పాఠశాల ఆవరణలో కూరగాయల మొక్కలు నాటించి తాజా కూరగాయలతో వంట చేసి విద్యార్థులకు అందేలా చూడాలన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

గొల్లపల్లి: మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన కొలిపాక చిన్న రాజేశం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన యువకులు, ప్రజాప్రతినిధులు రూ.72 వేల ఆర్థికసాయం అందించారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాగం శంకరయ్య, ప్రజాప్రతినిధులు ఒడ్నాల అంజయ్య, సింగారెడ్డి మధుకర్‌రెడ్డి, బుర్ర తిరుపతి, కాసారపు అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వెల్గటూర్: సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూటీఎస్ డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో బోనగిరి ప్రభాకర్, హెచ్‌ఎం చిప్ప నందయ్య, సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ నర్సింగం, శ్రీధర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాలక్రైం: రాయికల్ పట్టణంలో ఎస్సై సుధీర్ రావు ఆధ్వర్యంలో ఇటీవల వాహనాల తనిఖీ చేపట్టగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం హనుమండ్లపల్లికి చెందిన అవుల సంతోష్ అతిగా మద్యం తాగి వాహనం నడుపగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని బుధవారం స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ న్యాయమూర్తి కరుణాకర్ ఎదుట హాజరు పర్చగా సంతోష్‌కు మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రామాలయంలో పూజలు

కథలాపూర్: మండల కేంద్రంలోని శ్రీ సీతారాముడు ఆలయంలో బుధవారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ సీతారాముడికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా పోచమ్మతల్లి ఆలయ వారోత్సవాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని లోకమాత పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి గోదావరి జలాలతో 108 మంది దంపతులచే అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు విష్ణుశర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, రాజగోపాలచారి, రాఘవచారి పాల్గొన్నారు.

మేరు సంఘం కార్యవర్గం



కోరుట్ల: కోరుట్ల మేరు సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా గట్ల నరేష్, ఉపాధ్యక్షుడిగా పాల్కం రాజు, ప్రధాన కార్యదర్శిగా గట్ల శ్రీనాథ్, కోశాధికారిగా సంగ మహేష్, సహా కార్యదర్శిగా సంగ హరీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ అసమర్థతతోనే యూరియా కొరత



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత పాలనతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మితో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత రబీ సీజన్‌కు గాను రాష్ట్రానికి 9.87 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయాల్సి ఉంటే 12.47లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందజేసిందన్నారు. అందులో 10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియానే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు విక్రయించిందన్నారు. మిగిలిన 2.04 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఖరీఫ్ సీజన్‌కు ఓపెనింగ్ స్టాక్‌గా అందుబాటులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో మండల ప్రబారీ రాజేందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముద్దం రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఆకుల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఎస్సైకి గౌడ సంఘం నాయకులు వినతి



వినతిపత్రం ఇస్తున్న గౌడ సంఘం నాయకులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో గీత కార్మిక సహకార సంఘంకు చెందిన భూమి హద్దుల్లో రక్షణగా ఏర్పాటు చేసిన జాలీలను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు తహసీల్దార్, ఎస్సైకి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. గ్రామ శివారులో తమకున్న 5 ఎకరాల భూమిలో ఈత చెట్లు పెంచుకుని ఏళ్లుగా ఉపాధి పొందుతున్నామని, గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు భూమి హద్దుల్లో ఏర్పాటు చేసిన జాలీలను తొలగించారన్నారు. తమకు నష్టపరిహారం ఇప్పించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో గీత కార్మిక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు ముంజ లస్మయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సంకల్ప ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాహకులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ జీవిత బీమా ఏజెంట్లు, ఉద్యోగులు సంకల్ప ర్యాలీ ఘనంగా నిర్వహించారు. వంద మీటర్ల పొడవాటి జాతీయ జెండాను ప్రదర్శిస్తూ జగిత్యాలలోని పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, టవర్ సర్కిల్‌మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ క్లస్టర్ హెడ్ రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ, దేశభక్తి ఉన్న ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఉండాలని, కుటుంబాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరికి జీవిత బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు మహేశ్, సృజన్, రాజు, రాజేందర్, బాపురెడ్డి పాల్గొన్నారు.